క్లుప్తంగా

ఆర్థిక ప్రణాళిక చాలా ముఖ్యం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రతి ఒకరికి ఆర్థిక ప్రణాళిక చాలా ముఖ్యమని ఏంజెల్ వన్ లిమిటెడ్ ప్రాంతీయ శిక్షణ మేనేజర్ అమృత జ్యోతిదత్త అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఎంబీఏ విద్యార్థులకు ఆర్థిక విశ్లేషణ విధానాలపై సదస్సును బుధవారం ఆ కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమృతజ్యోతిదత్త మాట్లాడుతూ విద్యార్థులకు ఆర్థిక ప్రణాళిక గురించి లోతైన అవగాహన ఉండాలన్నారు. మార్కెట్‌లోని సంక్లిష్టతలను అర్థం చేసుకుని, విశ్లేషణా విధానాలపై ఆసక్తిని పెంపొందించుకోవటంలో పట్టు సాధించాలన్నారు. మార్కెట్ గమనాలను సాంకేతికంగా విశ్లేషించటంలో విద్యార్థులకు అవసరమైన సూచనలను చేశారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. సదస్సుకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శర్వాణకుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు వారివారి రంగాలకు సంబంధించిన అంశాలపై పట్టు సాధించే దిశగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ విజయదుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఒంగోలుకు చెందిన లిటిల్ చాంప్స్ ఎడ్యుకేషన్ సొసైటీ కళానిలయానికి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. బుధవారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై 17 మంది కళాకారులు కూచిపూడి నృత్యంలో పలు అంశాలను ప్రదర్శించారు. అందులో నరసింహస్వామి వారి అవతారంపై ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులందరినీ అలరించింది. సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించిన చిన్నారులను ఆలయ ఈవో కె.ఎస్.రామరావు అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం కళాబృందంలోని సభ్యులకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

సంస్కృతీ సంప్రదాయాలను అలవరచుకోవాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):విద్యార్థులు భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను అలవరచుకోవాలని కూరపాటి చంద్రశేఖరరావు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ గానుగుల యుగంధరాచార్య అన్నారు. పాఠశాల ఆధ్వర్యంలో గీతా జయంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ఒకటి నుంచి పదో తరగతి వరకూ ఉన్న విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం బహుమతి ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ యుగంధరాచార్య మాట్లాడుతూ ఈ పోటీల వలన విద్యార్థులలో స్వచ్ఛమైన ఉచ్చారణ, మానసిక వికాసంతో పాటు ఏకాగ్రత పెరిగి జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. ఈ పోటీలలో 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సిద్ధేశ్వరాచారి, యశస్వినీ, అనన్యశ్రీ, తులసీధర్, భవ్యశ్రీ ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. పాఠశాల కార్యదర్శి కూరపాటి చంటి విజేతలకు బహుమతులు, భగవద్గీత పుస్తకాలను అందజేశారు.

అటకెక్కిన సేంద్రియ ఎరువు తయారీ కేంద్రాలు

- వృథాగా పడి ఉన్న ఆన్‌సైట్ వర్మి కంపోస్ట్ యూనిట్ సైట్లు
- యూనిట్లలో కానరాని పల్వరైజింగ్ మెషీన్లు
- పట్టించుకోని నగర పాలక సంస్థ ఉన్నతాధికారులు



ఊర్మిళానగర్‌లో నిరుపయోగంగా ఉన్న ఆన్‌సైట్ కంపోస్ట్ యూనిట్

భవానీపురం(విజయవాడపశ్చిమ): సేంద్రియ ఎరువు తయారీ కోసం నగరపాలక సంస్థ ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన ఆన్‌సైట్ కంపోస్ట్ యూనిట్ల సైట్లన్నీ వృథాగా పడి ఉన్నాయి. సుమారు తొమ్మిదేళ్ల క్రితం (టీడీపీ ప్రభుత్వ హయాంలో) గట్టు వెనుక ప్రాంతంలోని ఊర్మిళానగర్, కబేళా, భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీ, ప్రియదర్శిని కాలనీ, రైతుబజార్‌లలో ఆన్‌సైట్ వర్మి కంపోస్ట్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఇళ్ల నుంచి సేకరించిన తడి చెత్తను పిట్లలో నిల్వ చేసి కంపోస్ట్ చేయగా కొన్నాళ్ల తరువాత అది ఎరువు తయారయ్యేది. భవానీపురం రైతుబజార్‌లో పనికిరాని కూరగాయలు, ఆకుకూరలను ప్లాంట్‌లోని పల్వరైజింగ్ మెషీన్ల ద్వారా క్రష్ చేసి కంపోస్ట్ యూనిట్లకు పంపేవారు. ఆయా యూనిట్ల ద్వారా ఏడాదికి సుమారు 8–10 టన్నుల వర్మి కంపోస్ట్ (సేంద్రియ ఎరువు) తయారయ్యేది. ఇప్పుడు ఆ పరిస్థితి దరిదాపుల్లో లేదు. నగరపాలక సంస్థకు చెందిన పార్కుల్లో చెట్ల నుంచి రాలిన ఆకులను నేరుగా కంపోస్ట్ చేయటం ద్వారా సేంద్రియ ఎరువు తయారవుతుంది. ఇప్పుడు రాలిన ఆకులను పోగేసి తగులబెడుతున్నారు. నగరపాలక సంస్థ కమిషనర్లుగా పలువురు ఉన్నతాధికారులు విధులు నిర్వర్తించినా ఆన్‌సైట్ కంపోస్ట్ యూనిట్లపై దృష్టి సారించలేదు. ముఖ్యంగా కంపోస్ట్ ప్లాంట్స్ నిర్వహణ బాధ్యతలు చూడాల్సిన మున్సిపల్ కార్పొరేషన్ చీఫ్ మెడికల్ ఆఫీసర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వాటి వైపే చూడలేదు.

గట్టు వెనుక యూనిట్లన్నీ మూసివేతే...

గట్టు వెనుక ప్రాంతంలోని అన్ని ఆన్‌సైట్ కంపోస్ట్ యూనిట్లన్నీ మూతపడ్డాయి. ఊర్మిళానగర్ ప్లాంట్‌లో షెడ్, దానికి అనుబంధంగా నిర్మించిన మరో షెడ్ నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఆ ప్లాంట్‌లోని మెషీన్లు ఏమైపోయాయో తెలియని పరిస్థితి. ఇక విద్యాధరపురంలోని కబేళా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆన్‌సైట్ కంపోస్ట్ యూనిట్ పరిస్థితి కూడా అంతే. భవానీపురం రైతు బజార్‌లోని ప్లాంట్‌కు తాళం వేసి ఏళ్లు గడుస్తున్నాయి. భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీలోగల పార్క్‌లో ఏర్పాటు చేసిన ప్లాంట్ మూతబడి శిథిలావస్థకు చేరుకుంది.

లభ్యం కాని సేంద్రియ ఎరువు

ఇళ్లల్లో మొక్కలు పెంచుకునే వారికి గతంలో ఆన్‌సైట్ కంపోస్ట్ ప్లాంట్ నుంచి అతి తక్కువ ధరకు సేంద్రియ ఎరువు లభించేది. నగరపాలక సంస్థకు చెందిన పార్కులలో ప్లాంట్‌ల ద్వారా తయారయ్యే సేంద్రియ ఎరువును వాడేవారు. నాటి నుంచి నేటి వరకు గట్టు వెనుక ప్రాంత ప్రజలకు సేంద్రియ ఎరువు దొరకని పరిస్థితి నెలకొంది. ఇళ్ల వద్ద నుంచి సేకరించిన తడి చెత్తను తీసుకువచ్చి ప్లాంట్లలో డంప్ చేసేవారు. దానిని మెషీన్లలో వేసి క్రష్ చేసి కంపోస్ట్ కోసం నిర్మించిన పిట్లలో వేసేవారు. ప్రస్తుతం తడి చెత్తను అజిత్‌సింగ్‌నగర్‌లోని డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నారు. వర్మి కంపోస్ట్ ప్లాంట్ల నిర్మాణం, నిర్వహణలో అనుభవం గల మద్దుకూరి సుబ్బారావును నగరపాలక సంస్థ గతంలో సలహాదారుగా నియమించుకుంది. ఆ సమయంలో నగరంలో మొత్తం 30 వరకు వర్మి కంపోస్ట్ ప్లాంట్లు ఉండేవి. తద్వారా ఏడాదికి సుమారు 30 టన్నుల సేంద్రియ ఎరువు లభ్యమయ్యేది.



కబేళా ప్రాంగణంలో వృథాగా పడి ఉన్న ఆన్‌సైట్ కంపోస్ట్ యూనిట్



హౌసింగ్‌బోర్డ్‌కాలనీ పార్క్‌లో శిథిలావస్థలో ఉన్న ఆన్‌సైట్ కంపోస్ట్ యూనిట్

పండ్లు, పౌష్టికాహారం పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెడిక ఆధ్వర్యంలో బుధవారం నిరుపేద, హెచ్‌ఐవీ బాధితులకు పండ్లు, న్యూట్రిషన్ ఫౌడర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఆర్టీ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వీర్నాల గౌతం అంబేద్కర్, డాక్టర్ శ్రీదేవి హెచ్‌ఐవీ సోకిన వారు పౌష్టికాహారం తీసుకోవాల్సిన అవసరం గురించి వివరించారు. హెచ్‌ఐవీ బాధితులకు న్యూట్రిషన్ ఫౌడర్, పండ్లు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెడిక సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. క్లబ్ అధ్యక్షులు పైడిమర్రి వేణుగోపాల్ మాట్లాడుతూ తమ వంతు సామాజిక బాధ్యతగా తాము నిరుపేదలు, హెచ్‌ఐవీ సోకిన వారికి న్యూట్రిషన్ ఫౌడర్, పండ్లు అందజేస్తున్నట్లు తెలిపారు. హెచ్‌ఐవి సోకిన వారికి న్యూట్రిషన్ అవసరం ఎంతైనా ఉందన్నారు. కావున తమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్, సిపిర్ ప్రోగ్రామ్స్ లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ దేవతి నాగేశ్వరరావు మాట్లాడుతూ రూ. 295 విలువగల ప్రోటీన్ పౌడర్ డబ్బాలను బెంగళూరు హై -కార్ప్ సంస్థ స్పాన్సర్ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈనెల 14వ తేదీన మరో వంద మందికి న్యూట్రిషన్ ఫౌడర్, విద్యార్థులకు నోట్‌బుక్స్, పండ్లు, మిఠాయిలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పువ్వాడ లక్ష్మి శ్రీనివాస్, కోశాధికారి గుర్రం లక్ష్మీనారాయణ, జీవీ సుబ్రహ్మణ్యం, కౌన్సిలర్లు, కె.వరప్రసాద్, లక్ష్మణరావు, వైఆర్‌జీకేర్ సంస్థ సిబ్బంది నాగూర్‌బీ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): పెంచిన విద్యుత్ చార్జీలు, ట్రూ అప్ చార్జీలు వెంటనే రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిలుపుదల చేయాలని సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ ఆధ్వర్యంలో జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో బుధవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు, కార్పొరేటర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమన్న ముఖ్యమంత్రి చంద్రబాబు తన మాటను నిలబెట్టుకోవాలని అన్నారు. కరెంట్ చార్జీల పెంపుదల వలన నిత్యావసర వస్తువుల ధరలకు అడ్డూ అదుపు లేకుండా పోతోందని, అదానీ లాభాల కోసం రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేయవద్దని కోరారు. కాలనీలో కుక్కల బెడద ఎక్కువై కార్మికులు తీవ్ర గాయాలపాలయ్యారని తెలిపారు. వీధి కుక్కల స్వైరవిహారాన్ని నివారించి ప్రజలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.రవి, ఎం.శ్రీను, దుర్గా, బుద్దే అప్పారావు, యోహాన్, లక్ష్మి, పైడమ్మ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ కాలనీలో నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు, కార్మికులు

నెలాఖరులోగా అక్కినేని విగ్రహావిష్కరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్):డాక్టర్ అక్కినేని నాగేశ్వర రావు శత జయంతి పురస్కరించుకుని తుమ్మలపల్లి వారి కళాక్షేత్రం ప్రాంగణంలో డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ, ఎక్స్‌రే సంస్థ ఆధ్వర్యాన ఈనెలాఖరులోగా డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు తెలిపారు. దుర్గాపురానికి చెందిన డాక్టర్ బ్రహ్మదేశం సోషల్‌సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, పద్మ విభూషణ్ నటసామ్రాట్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు విగ్రహావిష్కరణ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని చెప్పారు. ఇప్పటికే డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు విగ్రహం తీసుకురావటం జరిగిందన్నారు. సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ మాట్లాడుతూ అక్కినేని విగ్రహావిష్కరణకు సహకరిస్తున్న ఎక్స్‌రే సంస్థ అధ్యక్షులు కొల్లారికి కృతజ్ఞతలు తెలిపారు. తాము ఇప్పటికే పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఇప్పుడు అక్కినేని విగ్రహం ఏర్పాటు చేస్తున్నామన్నారు. తెలుగు చిత్రపరిశ్రమంలో తనదైన ముద్రను వేసిన అక్కినేని విగ్రహావిష్కరణ కార్యక్రమంకు అక్కినేని అభిమానులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి కొండాయగుంట రాము, బండారు వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అక్కినేని విగ్రహం వద్ద కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, బ్రహ్మదేశం వసంతకుమార్

అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తాం

ఆటోనగర్(విజయవాడతూర్పు):హెవీఎర్త్ మూవర్స్ డీలర్స్ టెక్నీషియన్స్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు ఎండీ అక్రమ్ అన్నారు. ఆటోనగర్‌లోని ఆటోమొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ హాల్లో బుధవారం అధ్యక్ష ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు అక్రమ్ మాట్లాడుతూ గత కొంత కాలం నుంచి అసోసియేషన్ పలు సేవా కార్యక్రమాలతో పాటు సభ్యులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నట్టు చెప్పారు. 2016 లో అసోసియేషన్ స్థాపించినప్పటి నుంచి సభ్యుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నట్టు చెప్పారు. 200 మంది పైగా సభ్యులు ఉన్నారన్నారు. గత మూడు నెలల క్రితం విజయవాడలో వచ్చిన వరదలో కూడా బాధితులకు ఆర్థిక సహాయ సహకారాలు అందించినట్టు చెప్పారు. అంతే కాకుండా అసోసియేషన్ అభివృద్ధికి భవిష్యత్‌లోనూ మరిన్ని సేవలు అందిస్తామన్నారు. సభ్యులందరి సహకారంతో ముందుకు పోతామన్నారు. అసోసియేషన్ సభ్యులు ఎవరైనా అనుకోకుండా ప్రమాదాలు.. సాధారణంగా మరణిస్తే ఆ సభ్యుని మట్టి ఖర్చులకు నిమిత్తం రూ.20 వేలు తక్షణ సహాయం అందిస్తామన్నారు. ప్రతి సభ్యునికి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ అధికారి అబ్దుల్ కాళిక్, అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు షేక్ మునీర్. కొండా, ఎస్‌కె ట్రేడర్స్ సలీం కృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.



అక్రమ్ విజయం సాధించడంతో అభినందనలు తెలుపుతున్న సభ్యులు

అలరించిన ఆపాత మధురాలు



విజయవాడ కల్చరల్: సురభి కళావేదిక నెల వారీ కార్యక్రమంలో భాగంగా కౌతా పూర్ణానందం కళావేదికమీద బుధవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకుడు కామినేని ఉదయ శంకర్ పర్యవేక్షణలో గాయనీ గాయకులు కుసుమాంజలి, దయామణి, శ్రావణి, రహీమాలు తెలుగు, హిందీ చిత్రగీతాలను మధురంగా ఆలపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ కళా సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సాంస్కృతిక కళా సంస్థలు నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పించాలన్నారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు చంద్రశేఖర్, జాస్తి కృష్ణ సింధూ, కృష్ణకుమారి పాల్గొన్నారు. నిర్వాహకులు గాయనీ గాయకులను ఆత్మీయంగా సత్కరించారు.

పోరంకిలో రామ్‌రాజ్ షోరూమ్ ప్రారంభం



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని పోరంకిలో రామ్‌రాజ్ షోరూమ్‌ను బుధవారం చీఫ్ కమిషనర్ ఆఫ్ స్టేట్ కమర్షియల్ ట్యాక్స్ డిపార్టుమెంట్ కమిషనర్ బాబు.ఎ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి రామ్‌రాజ్ దుస్తులు అద్దం పడతాయని, అన్ని వర్గాలకు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ దుస్తులు నాణ్యమైన కాటన్‌తో తయారైనందున యాంటీ బ్యాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్‌లను నివారిస్తాయని, షర్టులు, ధోతీలు, బనియన్లు తదితరాలతో దక్షిణాదితో పాటు ఉత్తర భారతదేశంలో కూడా మంచి గుర్తింపు సాధించిందన్నారు. కార్యక్రమంలో దుర్గగుడి ఈవో కేఎస్ రామరావు, విజయ పికిల్స్ మేనేజింగ్ డైరెక్టర్ కాటూరి రాము, రామ్‌రాజ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉపనిషత్తుల సారాంశమే గీతా యజ్ఞం

డాక్టర్ యుగంధరాచార్య గురూజీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): భగవాన్ శ్రీకృష్ణ పరమాత్మ బోధించిన ఉపనిషత్తుల సారాంశమే గీతా యజ్ఞమని, అది సర్వ మానవాళికి వర్తిస్తుందని డాక్టర్ గానుగుల యుగంధరాచార్య గురూజీ అన్నారు. గీతా జయంతిని పురస్కరించుకుని భవానీపురం కరకట్ట సౌత్ రోడ్‌లోని శ్రీకృష్ణ దేవస్థానంలో బుధవారం ఆయన ఆధ్వర్యంలో వంద మంది విద్యార్థులతో గీతా పారాయణం జరిగింది. విద్యార్థులందరూ భక్తి, జ్ఞాన, కర్మ, పురుషోత్తమ, మోక్ష సన్యాస యోగంలోని శ్లోకాలను పారాయణం చేశారు. ఈ సందర్భంగా యుగంధరాచార్య గురూజీ మాట్లాడుతూ రాగ, ద్వేష, క్రోధ, భయాలను విడిచి శ్రీకృష్ణుని ధ్యానించినవారు ఆయన అనుగ్రహాన్ని పొందుతారని తెలిపారు. బుద్ధిమంతుడు, కోరికలు లేనివారు, జయాపజయాల పట్ల సమబుద్ధి కలిగినవారు, ఈర్ష్యా రహితులు బంధాలలో చిక్కుకోరని అన్నారు. ఎటువంటి వారైనా జ్ఞానంతో సంస్కరింపబడతారని చెప్పారు. కురుక్షేత్ర సంగ్రామం ఆరంభంలో కృష్ణ భగవానుడు అర్జునునికి బోధించిన జ్ఞానమే గీతా సారాంశమని అన్నారు. భగవద్గీతలో భగవంతుని తత్వం, ఆత్మ తత్వం, జీవన గమ్యం, గమ్య సాధనా విధానాలు బోధించారని వివరించారు. కార్యక్రమంలో దేవస్థాన కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, లాకా తిరుపతయ్య యాదవ్, చెవుల ఆంజనేయులు యాదవ్, ఎం.రాజయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థాన కమిటీ అధ్యక్షుడు చెన్నయ్య యాదవ్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేసి చిత్రాన్న ప్రసాదం, స్వీట్లు పంచిపెట్టారు.



విద్యార్థులతో యుగంధరాచార్య గురూజీ, దేవస్థాన కమిటీ సభ్యులు, అతిథులు

వక్ఫ్ కమిటీని రద్దు చేయాలి

నవరంగ్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు షేక్ జలీల్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):టీడీపీ కూటమి ప్రభుత్వం నియమించిన వక్ఫ్ కమిటీని తక్షణమే రద్దు చేయాలని నవరంగ్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు షేక్ జలీల్ డిమాండ్ చేశారు. బుధవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నియమించిన కమిటీని రద్దు చేసి ఎన్నికలు నిర్వహించాలన్నారు. వక్ఫ్ కమిటీ ఎన్నికలు నిర్వహించకుండా అధ్యక్షుడిని ప్రకటించడం సరైన పద్ధతి కాదన్నారు. అన్యాక్రాంతమైన వక్ఫ్ బోర్డు భూములపై సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరారు. భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని మైనార్టీల్లోని పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డులో పనిచేస్తున్న అధికారులను ప్రక్షాళన చేయాలన్నారు. ఎన్నికల ముందు ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో షాదీఖానాలకు స్థలాలు కేటాయించి ప్రభుత్వమే నిర్మాణం చేయాలని తెలిపారు. దుల్హన్ పథకాన్ని అమలు చేసి రూ. లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జాకీర్ హుస్సేన్, సయ్యద్ సైదా, గుర్రం రామారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ జలీల్

దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు కృషి

ఏసీపీ లతకుమారి

మధురానగర్(విజయవాడసెంట్రల్): దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు తెలిపారు. అయోధ్యనగర్ చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ ఆధ్వర్యాన మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకుని డాక్టర్ టి.కృష్ణకుమారి అధ్యక్షతన దివ్యాంగుల హక్కులు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. దివ్యాంగులు తమ హక్కులు గురించి పూర్తి అవగాహన కలిగి ఉండటంతో పాటు వాటిని వినియోగించుకోవాలని సూచించారు. అవగాహన సదస్సులో దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ సహాయ సంచాలకులు కామరాజు, మండల న్యాయ సేవాసంస్థ సెక్రటరీ త్రినాథ్, మహిళ పోలీస్‌స్టేషన్ ఏసీపీ లతకుమారి, రిటైర్డ్ ఆర్జేడీ సూయజ్, రిటైర్డ్ ఏడీ ఏవీడీ నారాయణరావు, ఎస్‌బీఐ బ్రాంచి డెప్యూటీ మేనేజర్ దుర్గాప్రసాద్ పాల్గొని దివ్యాంగులు హక్కులు, అమలు, ఎదుర్కొంటున్న సమస్యలు గురించి మాట్లాడారు. అలాగే నేషనల్ ట్రస్ట్ దివ్యాంగులకోసం ఏర్పాటు చేసిన నిరామయ ఆరోగ్య బీమా పథకం గురించి వివరించారు.




మాట్లాడుతున్న ఏసీపీ కె.లతకుమారి

నగరంలో క్రిస్మస్ సందడి

భవానీపురం(విజయవాడపశ్చిమ): మరో పక్షం రోజుల్లో క్రిస్మస్ పండుగ రానున్న నేపథ్యంలో పశ్చిమ నియోజకవర్గం గట్టు వెనుక ప్రాంతంలోని పలు క్రీస్తు దేవాలయాల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు జరుగుతున్నాయి. ఆయా దేవాలయాల వద్ద స్టార్‌లు వేలాడదీశారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఇప్పటికే సెమీ క్రిస్మస్‌లు, క్యారెల్స్‌లతో చర్చిలు, ప్రార్థనా మందిరాల నిర్వాహకులు ఆయా వీధుల్లో సందడి మొదలుపెట్టేశారు. ప్రధానంగా ఏసుక్రీస్తు ప్రభువు పుట్టిన ప్రదేశాన్ని జ్ఞానులకు చూపించిన నక్షత్రానికి గుర్తుగా ప్రతి క్రైస్తవ విశ్వాసులు, క్రైస్తవ మతపెద్దలు వారి నివాసాల ముందు, చర్చిలు, రోడ్ల వద్ద డిసెంబర్ 1వ తేదీ నుంచే పెద్ద పెద్ద స్టార్‌లను ఏర్పాటు చేయడంతో నగర వీధుల్లో క్రిస్మస్ కాంతులు విరాజిల్లుతున్నాయి. ఏసుక్రీస్తు పుట్టిన రోజు సందర్భంగా జరుపుకునే క్రిస్మస్ పండుగ సందడి మార్కెట్‌లో సైతం మొదలైంది. ఈ వేడుకల కోసం నెల రోజుల ముందు నుంచే క్రైస్తవ విశ్వాసులు అన్ని ఏర్పాట్లను చేసుకుంటున్నారు. దీంతో నగరంలో ఏ ప్రధాన కూడలి చూసినా.. ఏ దుకాణానికి వెళ్లినా శాంతా క్లాజ్ బొమ్మలు, స్టార్‌లు దర్శనమిస్తున్నాయి.



విద్యాధరపురంలోని సీఎస్‌ఐ క్రీస్తు దేవాలయం



భవానీపురం హౌసింగ్ బోర్డ్ కాలనీలో సెమీక్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చి



భవానీపురం హౌసింగ్ బోర్డ్ కాలనీలో విద్యుద్దీప కాంతుల్లో క్రీస్తు ప్రార్థనా మందిరం

అక్రమంగా నిల్వ చేసిన 20 క్వింటాళ్ల బియ్యం పట్టివేత



గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): భవానీపురం 41వ డివిజన్ పరిధిలోని ప్రెసిడెంట్ వీధిలో ఓ పాడుబడిన భవనంలో అక్రమంగా నిల్వ ఉంచిన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లైస్ అధికారులు పట్టుకున్నారు. బియ్యం అక్రమ రవాణా జరుగుతోందంటూ స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సివిల్ సప్లైస్ అధికారులు బుధవారం ఆ ఇంటిపై దాడి చేశారు. ఇంటిలో 41 తెల్ల సంచుల్లో నిల్వ ఉంచిన 20 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. భవానీపురానికి చెందిన కొల్లి తిరుపతమ్మ రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఆమె కార్డుదారుల నుంచి బియ్యం కిలో రూ.12 చొప్పున కొనుగోలు చేసి తరలించేందుకు సిద్ధం చేయగా అధికారులు పట్టుకున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న కొల్లి తిరుపతమ్మపై కేసు నమోదు చేసినట్లు ఆర్‌ఐ వెంకట్ తెలిపారు.